
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 3 మెదక్

జిల్లాల వార్తలు

సోమవారం 19 ఆగస్టు 2024

గురుకుల పాఠశాలలో విద్యార్థులకు కరెంట్ షాక్ 4లో

ఐఐటీ హైదరాబాద్‌లో ఫ్యూచర్ ఇన్వెంటర్స్ ఫెయిర్ 5లో

సమ్మెకు సై...



- రేపటి నుంచి సమ్మెలోకి 'ఆరోగ్యమిత్ర'లు
- వేతనాల పెంపు, ఉద్యోగ భద్రతకు డిమాండ్
- ఉమ్మడి జిల్లాలో 43 మంది
- ఆరోగ్యశ్రీ సేవలకు తప్పని ఆటకం

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 18 : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలు రేపటి నుంచి సమ్మె బాట పట్టనున్నారు. తమ డిమాండ్లు పరిష్కరించకపోతే సమ్మె తప్పదని వారు ఈ నెల 6న ఆరోగ్యశ్రీ ట్రస్టు అధికారులకు నోటీసును అందజేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆరోగ్యమిత్రలు కొన్ని నెలలుగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రితో పాటు ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవో, సచివాలయ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తూ వస్తున్నారు. కానీ ఇప్పటి వరకు స్పందన లేకపోవడంతో వారంతా సమ్మెలోకి వెళ్లాలని నిర్ణయించుకున్నారు.

డిమాండ్లు ఇవే..

ఆరోగ్యశ్రీ పథకం కింద 16 ఏళ్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించి పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, డీపీవో క్యాడర్ కల్పించాలని, జీవో నం 60 ప్రకారం వేతనాలు అమలు చేయాలని, విధి నిర్వహణలో మరణిస్తే రూ.50 లక్షల ఆర్థిక సాయం అందజేయడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, హెల్త్ కార్డులివ్వాలని, షఫ్లింగ్ విధానం రద్దు చేయాలనే డిమాండ్లతో ఉద్యోగులు సమ్మెకు వెళ్లనున్నారు.

ఉమ్మడి జిల్లాలో 43 మంది...

రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 43 మంది పనిచేస్తున్నారు. వీరంతా ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ఆరోగ్యశ్రీ ఎంపానల్డ్ ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యమిత్రలుగా పనిచేస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద రోగుల వివరాల నమోదు, పేషెంట్ అడ్మిషన్ నుంచి డిశ్చార్జ్ వరకు వైద్య సేవలపరంగా, ఇతరత్ర నిర్వహణలో వీరి పాత్ర కీలకం. వీరు సమ్మెకు దిగితే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్య సేవలు పొందేందుకు వచ్చే రోగులకు ఇబ్బందులు ఎదురుకానున్నాయి. సమ్మెకు ప్రజలు సహకరించాలని ఆరోగ్యమిత్రల సంఘం జిల్లా అధ్యక్షుడు హిమగిరి ప్రసాద్ కోరారు.



సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న జయంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పిస్తున్న టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి

సర్దార్ సర్వాయి పాపన్నకు నిర్మలా జగ్గారెడ్డి నివాళి

సంగారెడ్డి, ఆగస్టు 18: బడుగు బలహీనవర్గాల హక్కుల కోసం పోరాటం చేసిన ధీశాలి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. సర్వాయి పాపన్న జయంతి కార్యక్రమాన్ని సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి నిర్మలా జగ్గారెడ్డి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహుజన రాజ్యాన్ని స్థాపించిన మొట్టమొదటి వీరుడు పాపన్న అని అభివర్ణించారు. 12 మందితో తన పోరాటాన్ని ప్రారంభించి 12వేల మంది సైన్యాన్ని తయారు చేసిన నాయకుడని పేర్కొన్నారు. ఆయన పోరాట పటిమ నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. బహుజనుల ఐక్యత, సమానత్వం కోసం పాటుపడిన వ్యక్తిగా సర్వాయి పాపన్న చరిత్రలో నిలిచిపోతారని నిర్మలా జగ్గారెడ్డి కొనియాడారు.

అనుబంధాల 'రక్ష'

- నేడే రాఖీ పౌర్ణమి
- మార్కెట్లో కనువిందు చేస్తున్న వెరైటీ రాఖీలు
- కిటకిటలాడిన స్వీట్ షాపులు
- గిఫ్ట్‌షాపుల్లో పెరిగిన గిరాకీ

5లో



మెదక్‌లో వాగును తలపిస్తున్న రాందాస్ చౌరస్తా-మున్సిపల్ కాంప్లెక్ రోడ్డు

మళ్లీ దంచికొట్టిన వాన

- రాష్ట్రంలోనే అత్యధికంగా 6.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు
- రోడ్లన్నీ జలమయం

మెదక్ అర్బన్, ఆగస్టు 18: మెదక్ జిల్లాలో వర్షాల జోరు కొనసాగుతోంది. జిల్లాకేంద్రంలో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. రాష్ట్రంలోనే అత్యధికంగా మెదక్‌లో 6.7 సెం.మీ. వర్షపాతం నమోదైంది. పాతూర్‌లో 4.4 సెం.మీ., నాగాపూర్‌లో 3.9 సెం.మీ., రేగోడ్‌లో 3.9సెం.మీ., సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో 6.3సెం.మీ., బెజగాన్‌లో 4.5సెం.మీ., బేగంపేటలో 4.1సెం.మీ., సంగారెడ్డి జిల్లా దిగ్వాల్‌లో 5.4సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

ఉదయం నుంచి వాతావరణం సాధారణంగానే ఉంది. ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులుపడ్డారు. సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం ప్రారంభమై.. గంట పాటు దంచికొట్టింది. దీంతో, మెదక్ పట్టణంలోని ప్రధాన రహదారులు వాగులను తలపించాయి. పలు కాలనీల్లో డ్రైనేజీలు పొంగిపొర్లడంతో వీధులన్నీ జలమయమయ్యాయి. పట్టణంలోని రాందాస్ చౌరస్తా-మున్సిపల్ కాంప్లెక్ రహదారి చెరువును తలపించింది. రోడ్డు పక్క నిలిపిన బైక్‌లు వరద నీటిలో కొట్టుకుపోయాయి. పట్టణంలో పరిస్థితిని సమీక్షించిన మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. రోడ్లపై నిలిచిన నీటిని మళ్లించేందుకు ఏర్పాట్లు చేయించారు.



జలమయమైన రహదారి

జ్ఞాపకానికి దృశ్య రూపం..

జ్ఞాపకం చెదిరిపోవచ్చు.. కానీ చిత్రం కలకాలం నిలిచిఉంటుంది. వెయ్యి పదాలు చెప్పలేని భావాన్ని ఒక్క ఫొటో చెబుతుంది. గతాన్ని చిత్ర రూపంలో బంధించి ముందుతరాలకు అందజేసే కళనే ఫొటోగ్రఫీ. ఛాయాచిత్రాలు గతాన్ని గుర్తుచేయడమే కాకుండా.. భావోద్వేగాలను ప్రతిబింబిస్తాయి. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అలాంటి కొన్ని ఫొటోలు..

స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి జిల్లా









మద్యం మత్తులో తండ్రిని చంపిన తనయుడు

కోహెడలో గంజాయికి బానిసై కన్నతండ్రిపై దాడి



వీరేశంను విచారిస్తున్న ఎస్ఐ

జోగిపేట/కోహెడ, ఆగస్టు 18 : కన్న కొడుకే కాలయముడై తండ్రిని హత్య చేసిన ఘటన సంగారెడ్డి జిల్లా జోగిపేటలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, కాలనీవాసుల వివరాల ప్రకారం.. జోగిపేటలోని 10వ వార్డులో కుమ్మరి నారాయణ (50) కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతని కొడుకైన వీరేశం (30) మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. వీరేశం మద్యం కోసం ఇతరుల వద్ద అప్పులు చేశాడు. భూమి అమ్మి అప్పులు తీర్చాలంటూ.. రోజూ తండ్రిని వేధిస్తున్నాడు. దీనికి తండ్రి నారాయణ ఒప్పుకోలేదు. ఆదివారం ఉదయం ఇంట్లో నిద్రపోతున్న నారాయణను అతడి కొడుకు వీరేశం హత్య చేసి, ఉరి వేసి ఆత్మహత్యగా చిత్రీకరించాడు. వీరేశం గతంలో తల్లిని కూడా హతమార్చాడని ఆరోపణలుండడంతో కాలనీవాసులు పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ పాండు, సిబ్బంది మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గంజాయి మత్తులో..

సిద్దిపేట జిల్లా కోహెడ మండలం బస్వాపూర్‌లో గంజాయి మత్తులో ఓ యువకుడు ఆదివారం వీరంగం సృష్టించారు. గ్రామానికి చెందిన ద్యావర కనకయ్యకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు దేవర సురేష్ గంజాయి సేవించి తండ్రి కనకయ్యను చితకబాదాడు. గంజాయి, మద్యం మత్తులో ఉన్న సురేష్‌ను గ్రామస్థులు అడ్డుకున్నా కూడా వినకుండా విచక్షణారహితంగా దాడిచేయడంతో కనకయ్య స్పృహ కోల్పోయారు. ఆగ్రహించిన గ్రామస్థులు సురేష్‌ను బంధించి విద్యుత్ స్తంభానికి కట్టేశారు. కనకయ్యను సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ తిరుపతి సురేష్‌ను పోలీస్‌స్టేషన్‌ను తరలించారు.

ఉత్సాహంగా రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్

ఘనంగా ముగింపు వేడుకలు



పరుగు పందెంలో పాల్గొన్న క్రీడాకారులు

మెదక్ అర్బన్, ఆగస్టు 18: మెదక్ ఇందిరా గాంధీ స్టేడియంలో రెండు రోజుల పాటు జరిగిన 10వ తెలంగాణ స్టేట్ బాలబాలికల అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ ఆదివారం ముగిసింది. అథ్లెటిక్స్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను రంగారెడ్డి జిల్లా జట్టు కైవసం చేసుకుంది. పోటీల్లో మెదక్ జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. 400 మీటర్ల పరుగు పందెంలో దీపిక ద్వితీయ బహుమతి, 10 మీటర్ల రన్‌లో కావ్య ద్వితీయ బహుమతి, 100 మీటర్ల పరుగులో అనీష్ తృతీయ బహుమతి, షాట్‌పుట్‌లో నాజం ద్వితీయ బహుమతి సాధించారు. విజేతలకు రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ సారంగపాణి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మధుసూదన్, జాయింట్ సెక్రటరీ రాజేందర్, కోశాధికారి సుజాత, కోచ్ పృథ్వి, మౌలానా, చంటీ, స్పోర్ట్స్ ఫౌండేషన్ కార్యదర్శి జుబేర్, క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మహేందర్‌రెడ్డి, పీడీ, పీఈటీలు దేవేందర్‌రెడ్డి మహిపాల్, నరేష్, కుమార్, రవి, క్రీడాకారులు పాల్గొన్నారు.



బహుమతులను అందజేస్తున్న అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ సారంగపాణి

అభివృద్ధి, సంక్షేమాలకు సమ ప్రాధాన్యం

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

న్యాల్‌కల్, ఆగస్టు 18 : అభివృద్ధి, సంక్షేమాలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం రాఘవపూర్ గ్రామ పరిధిలో ఉన్న పంచవటి క్షేత్రం వద్ద ఏర్పాటుచేసిన మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే సుఖ సంతోషాలకు మూలమని పేర్కొన్నారు. జిల్లాలోనే మారుమూల ప్రాంతమైన న్యాల్‌కల్ మండలంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ప్రజల ప్రయోజనార్థం కాశీనాథ్‌బాబా ఆస్పత్రిని ఏర్పాటు చేయడం హర్షించ దగ్గ విషయమన్నారు. బేధ భావం లేకుండా వైద్యులు చేసే సేవలు దేవుడితో సమానమని అభివర్ణించారు. ప్రతీ వ్యక్తి ఆధ్యాత్మికంగా ఎదగడానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, కాశీనాథ్‌బాబా, వివిధ ఆశ్రమాల పీఠాధిపతులు, నాయకులు భాస్కర్‌రెడ్డి, మంకాల్ సుభాష్, తన్వీర్ కార్యకర్తలు పాల్గొన్నారు.



పంచవటి క్షేత్రంలో సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ



ఆస్పత్రిని ప్రారంభించి పూజలు చేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

కడుపునొప్పి భరించలేక వృద్ధుడి ఆత్మహత్య

● సిద్దిపేట పట్టణ శివారులో ఘటన

సిద్దిపేట క్రైం, ఆగస్టు 18: కడుపునొప్పి భరించలేక వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. సిద్దిపేట వన్‌టౌన్ సీఐ లక్ష్మీబాబు వివరాల ప్రకారం.. పట్టణంలోని వడ్డెర కాలనీకి చెందిన దెశెట్టి అయిలయ్య(72) నాలుగునెలలుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఆయుర్వేద మందులు సైతం వాడాడు. కడుపునొప్పి భరించలేక మనస్తాపానికి గురై ఇంటి నుంచి ఆదివారం బయటకు వెళ్లి.. పట్టణ శివారు బైపాస్ రోడ్డులోని చింత చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గురుకుల పాఠశాలలో విద్యార్థులకు విద్యుత్‌షాక్

● ఆరుగురికి గాయాలు
● గుట్టుచప్పుడు కాకుండా వ్యవహరించిన ప్రిన్సిపాల్
● తల్లిదండ్రులు రావడంతో విషయం బయటకు..


గాయాలను చూపిస్తున్న విద్యార్థులు

కౌడిపల్లి, అగస్టు 18: భోజనం చేసిన అనంతరం చేతులు శుభ్రం చేసుకునేందుకు వెళ్లిన విద్యార్థులకు కరెంట్ షాక్ రావడంతో చేతులకు గాయాలయ్యాయి. అయినా గుట్టుచప్పుడు కాకుండా ఉంచిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మెదక్ జిల్లా కౌడిపల్లి మండల పరిధిలోని తునికి ఎంజేపీ(మహాత్మా జ్యోతి పూలే) గురుకుల పాఠశాలలో 6వ తరగతి నుంచి డిగ్రీ వరకు 1,200 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. శనివారం సాయంత్రం భోజనం చేస్తున్న సమయంలో వర్షం పడింది. అనంతరం ప్లేట్లు శుభ్రం చేసేందుకు నల్లాల వద్దకు వెళ్లిన విద్యార్థులు ఆదిత్య, జశ్వంత్, అభిరామ్, దినేశ్వర్, వరుణ్, రిస్విక్‌తో పాటు కొంతమందికి విద్యుత్ షాక్ వచ్చి కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. గమనించిన తోటి విద్యార్థులు తమకు నీరుకోసం ఏర్పాటు చేసిన బోరుబావి వైరు తెగి పడి విద్యుత్ వస్తుందని గమనించారు. విషయం బయటకు రాకుండా ప్రిన్సిపాల్ గోప్యంగా ఉంచారు. ఆదివారం సెలవు కావడంతో గురుకుల పాఠశాలకు కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను చూసేందుకు రరాగా.. లోపలికి అనుమతించలేదు. పిల్లలను గేటు వరకు పిలిపించి యోగక్షేమాలు అడిగితే అసలు విషయం బయటపడింది. ఇంత ఘోరం జరిగి పిల్లలకు విద్యుదాఘాతంతో గాయాలైనా.. కనీసం సమాచారం అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ వందలమంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్న విషయాన్ని ఉపాధ్యాయులు మరిచిపోయారని, ప్రమాదవశాత్తు తెగిపడిన వైరును విద్యార్థులు గమనించకపోతే పెద్ద ప్రమాదం జరిగేదని పేర్కొన్నారు. తెగిపడిన వైరు విషయాన్ని విద్యుత్ అధికారులకు చెబితే ఆదివారం వచ్చి రిపేరు చేశారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ హరిబాబును వివరణ కోరగా.. గాలివన వచ్చిన సమయంలో బోరు నుంచి వచ్చే విద్యుత్ వైరు తెగిపడి ఎర్తింగ్ వచ్చిందని, అయినా విద్యార్థులకు ప్రమాదం జరగలేదన్నారు. విద్యుత్ అధికారులను పిలిపించి మరమ్మతులు చేయించామని పేర్కొన్నారు. ఏదేమైనా ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపించిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న హల్దీవాగు

తూప్రాన్, ఆగస్టు 18: జిల్లాలో మూడురోజులుగా కురుస్తున్న వర్షాలతో తూప్రాన్ ప్రాంతంలో హల్దీవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆదివారం ఉదయం నుంచి హల్దీవాగుపై నిర్మించిన చెక్‌డ్యాంలు పొంగిపొర్లుతున్నాయి. తూప్రాన్ మండలంలోని హల్దీవాగులో కొద్దిరోజులుగా నీరు లేకపోవడంతో రైతులు కాళేశ్వరం నీళ్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మూడురోజులుగా వర్షాలు కురుస్తుండటంతో తూప్రాన్ మండలంలోని యావాపూర్, తూప్రాన్, నాగులపల్లి గ్రామాల్లోని చెక్‌డ్యాంల్లో నీరు నిండి పొంగిపొర్లుతున్నాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


తూప్రాన్ వద్ద పొంగిపొర్లుతున్న హల్దీ చెక్‌డ్యాం

అనుబంధాల 'రక్షా'బంధన్

నేడే రక్షాబంధన్

- సోదర, సోదరీ ప్రేమకు ప్రతీక రాఖీ
- మార్కెట్లో కనువిందు చేస్తున్న వెరైటీ రాఖీలు
- స్వీట్ షాపులు, గిఫ్ట్‌షాపులకు పెరిగిన గిరాకీ



సిద్దిపేటలో రాఖీలు కొనుగోలు చేస్తున్న యువతులు, మహిళలు



వృక్షాలకు రాఖీ కట్టి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

సిద్దిపేట కల్చరల్/కొండపాక/మెదక్ కల్చరల్/నారాయణఖేడ్, ఆగస్టు 18: మన జీవితంలో ఎన్ని బంధాలున్నా సోదరీ, సోదరుల అనుబంధం అపురూపం. చెల్లె ఆపదలో ఉంటే అన్న ముందుంటాడు. తమ్ముడికి ఇబ్బంది వస్తే అక్క కంగారు పడుతుంది. ఇలా ఇద్దరి మధ్య ఉన్న అపురూపమైన బంధాన్ని పండుగలా చేసుకునేరోజు రక్షాబంధన్. తరాలు మారినా, యుగాలు తరిగినా చెరగని సోదర, సోదరీ ప్రేమకు ప్రతీక రాఖీ పండుగ. పురాణాల ప్రకారం కృతయుగం నుంచి ఈ పండుగను ఆచరిస్తున్నారు. రక్షాబంధన్ పండుగను రాఖీ పౌర్ణమి, రాఖీ పండుగ అని అంటారు. కొన్ని ప్రాంతాల్లో జంధ్యాల పౌర్ణమి, శ్రావణ పూర్ణిమ అని కూడా పిలుస్తారు. తెలుగు పంచాంగం ప్రకారం ప్రతి ఏడాది శ్రావణ పౌర్ణమి రోజున రక్షాబంధన్ చేసుకోవడం ఆనవాయితీగా వస్తుంది.

మార్కెట్లో కనువిందు చేస్తున్న కలర్‌ఫుల్ రాఖీలు

సిద్దిపేట పట్టణంతో పాటు, పలు మండలాల్లో రకరకాల రాఖీలు కనువిందు చేస్తున్నాయి. పట్టణంలో పలుచోట్ల రాఖీల స్టాల్స్ వెలిశాయి. వెరైటీ రాఖీలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. స్వస్తిక్ గుర్తు రాఖీలు, పూసలు, రంగురాళ్లు, వెరైటీ బొమ్మలతో ఉండే రాఖీలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. ఇక ఆధ్యాత్మికత ఉట్టిపడేలా రాఖీలు ఆకట్టుకుంటున్నాయి. పిల్లలు ఇష్టపడే విధంగా డిఫరెంట్ రాఖీలు అందుబాటులో ఉంచారు. ఎవరికి నచ్చిన రాఖీలు వారి సోదరులకు కట్టడానికి కొనుగోలు చేసేందుకు యువతులు, మహిళలు రాఖీ షాపింగ్ చేస్తున్నారు. మరోవైపు సోదరులు కూడా బహుమతి ఇవ్వడానికి చీరలు, సోదరికి నచ్చిన వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. పట్టణవాసులతో పాటుగా చుట్టుపక్కల పల్లెలనుంచి వస్తున్న వారితో రోడ్లన్నీ జనసందోహంగా మారాయి.

రాఖీ పండుగను ఎప్పుడు చేసుకోవాలి

తెలుగు పంచాంగం ప్రకారం సోమవారం రోజున పండుగ చేసుకోవాలని పంచాంగకర్తలు నిర్ణయించారు. అయితే భద్ర సమయం అని, ఆ సమయంలో కట్టుకుంటే మంచిది కాదని సోషల్ మీడియాలో వార్తలు వైరల్‌గా మారాయి. భద్ర సమయంలో రాఖీలు కట్టుకోకూడదు. కానీ ఈసారి పండుగకు ఆ సమస్య లేదని వేదపండితుడు జనమంచి సీతారామశర్మ ద్వివేది స్పష్టం చేశారు. సూర్యోదయం నుంచి రాత్రివరకు రాఖీలు కట్టుకోవచ్చని చెబుతున్నారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు నమ్మవద్దని హితవు చెబుతున్నారు.

రాఖీ కట్టేటప్పుడు ఏం చేయాలి

సోదరీమణులు సోదరులకు నుదట తిలకం పెట్టి రాఖీలను కడతారు. అనంతరం హారతి ఇచ్చి స్వీట్లు తినిపించి నోరు తీపి చేస్తారు. సోదరులకు ఆరోగ్యం, సంపద, శుభం కలగాలని దేవుడిని వేడుకుంటారు. ఈ సందర్భంగా సోదరీమణులకు బహుమతులు ఇచ్చి, జీవితాంతం తోడుగా ఉంటామని భరోసానిస్తారు.

రాఖీ కట్టేటప్పుడు చదవాల్సిన శ్లోకం

యేన బద్ధో బలీ రాజ దానవేంద్రో మహాబలః
తేనాత్వమభిబధ్నామి రక్ష మాచల మాచల

సోదరులకు సోదరి రాఖీ కడుతూ ఈ శ్లోకాన్ని చదివినట్లయితే వారికి విష్ణుమూర్తి అనుగ్రహం కలుగుతుందని పండితులు చెబుతున్నారు.

రాఖీ పండుగతో పర్యావరణానికి రక్ష



పర్యావరణ రక్షణ పట్ల అవగాహన పెంచేందుకు రాఖీ పండుగను ఉపయోగించుకుంటున్నారు పర్యావరణ ప్రేమికులు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ అనే పర్యావరణ సంస్థ అధ్వర్యంలో వృక్షాబంధన్ అనే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి వృక్షాలకు, మొక్కలకు రాఖీ కట్టారు. అనంతరం మనం వృక్షాలకు రక్ష, వృక్షాలకు మనం రక్ష, కలిస్తే పర్యావరణానికి రక్ష అని ప్రతిజ్ఞ చేశారు. ఇక ఎకో ఫ్రెండ్లీ రాఖీలంటూ పంచాయతీరాజ్‌శాఖ అధ్వర్యంలో గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఆకులు, పూలతో తయారుచేసిన రాఖీలనే కట్టాలని వారు సూచిస్తున్నారు.

హుస్నాబాద్‌లో రాఖీ పండుగ సందడి

హుస్నాబాద్, ఆగస్టు 18 :హుస్నాబాద్ పట్టణంలో ఆదివారం రాఖీ పౌర్ణమి సందడి నెలకొంది. సోమవారం రాఖీ పండుగ కావడంతో పట్టణంలో ప్రధాన రహదారికి ఇరువైపుల పెద్ద ఎత్తున రాఖీల విక్రయ దుకాణాలు వెలిశాయి. విభిన్న అకృతుల గల రాఖీలను విక్రయించారు. వీటిని కొనుగోలు చేసేందుకు మహిళలు అసక్తి కనబరుస్తూ దుకాణాల వద్ద బారులు తీరారు. అలాగే స్వీటు షాపుల వద్ద కూడ రద్దీ ఏర్పడింది.



సిద్దిపేటలో రాఖీ స్టాల్స్ వద్ద జనాల సందడి



మెదక్‌లో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు



వెరైటీ డిజైన్లలో స్పెషల్ రాఖీలు

ఈ సంవత్సరం భద్ర సమయం భయమక్కర్లేదు



సూర్యోదయానికి ముందుగా పూర్ణిమ తిథి లేనప్పుడు మాత్రమే భద్ర సమయం ఉంటుంది. ఈ సంవత్సరం అలాంటి ఇబ్బంది లేదు. ఆదివారం రాత్రి 2 గంటల 28 నిమిషాల నుంచి సోమవారం రాత్రి 12 గంటల 30 నిమిషాల వరకు పౌర్ణమి ఉంటుంది. కాబట్టి సూర్యోదయం నుంచి రాఖీ కట్టుకోవచ్చు. సోషల్ మీడియాలో వస్తున అవాస్తవాలను నమ్మవద్దు. వాస్తవానికి తిథిలో మార్పులు జరిగినప్పుడు భద్ర సమయం ఏర్పడతుంది. ఆ సమయంలో తన సోదరి యమి దగ్గరకు రక్ష కట్టుకోవడానికి వెళ్తాడు. ఆ సమయంలో యమకాలమని అంటారు. ఈ సమయంలో రాఖీ కట్టుకుంటే మంచిది కాదు, కానీ ఇది కేవలం సూర్యోదయానికి ముందు పౌర్ణమి తిథి లేనప్పుడు మాత్రమే ఈ నియమాలు పాటించాలి. ఈ ఏడాది ఎలాంటి ఇబ్బంది లేదు. సూర్యోదయానికి ముందే పౌర్ణమి తిథి వచ్చింది. కాబట్టి అందోళన పడాల్సిన పని లేదు.

\- జనమంచి సీతారామశర్మ ద్వివేది, వేదపండితులు

మహిళల రక్షణకు అందరు కంకణబద్ధులు కావాలి



హిమాలయాల నుంచి మొదలుకుని హిందూ మహాసముద్రం వరకు, సింధూసాగరం నుంచి మొదలుకుని గంగా సాగరం వరకు భారతదేశమంతా ఆప్యాయంగా చేసుకొనే పండుగ రక్షాబంధన్. మన పురాణ గాథల ప్రకారం ఒక విజయాన్ని కాంక్షించి కట్టే రక్షణే రక్షాబంధన్. సమాజహితం కోసం స్నేహభావం, ప్రేమభావంతో సోదరులకు, ఆత్మీయులకు, బంధువులకు, స్నేహితులకు వారి విజయాన్ని కాంక్షిస్తూ రాఖీ కట్టవచ్చు. ప్రస్తుత సమాజంలో మహిళలకు రక్షణ కరువైంది. కాబట్టి ప్రతి సోదరుడు ఒక శ్రీరాముడి వలే, ఒక శ్రీకృష్ణుడి వలే మహిళలకు రక్షణగా ఉండాలని రక్షాబంధన్ ప్రతిజ్ఞ చేయాలి.

\- విజయ, ఉపాధ్యాయురాలు



ఎకో రాఖీలు కట్టుకుంటున్న గ్రామస్థులు

దుద్దెడలో ఎకో ఫ్రెండ్లీ రాఖీల పంపిణీ

కొండపాక, ఆగస్టు 18: కొండపాక మండలం దుద్దెడలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తయారుచేసిన ఎకో ఫ్రెండ్లీ రాఖీలను ఆదివారం పంపిణీ చేశారు. దుద్దెడ గ్రామాన్ని ప్లాస్టిక్‌రహిత తీర్చిదిద్దడంలో భాగంగా రాఖీ పండుగ సందర్భంగా ప్రకృతి సిద్ధంగా లభించిన తాటి ఆకుల పువ్వులతో రాఖీలను తయారు చేశారు. వీటిని గ్రామంలో పంపిణీ చేశారు. గ్రామపంచాయతీలో సిద్ధంగా ఉంచారు. ఆదివారం పలువురు రాఖీలను కట్టుకుని ముందస్తు పండుగ చేసుకున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి ఆత్మహత్య



పోతుల అరుణ్ (ఫైల్)

సిద్దిపేట రూరల్, ఆగస్టు 18: అనుమానాస్పద స్థితిలో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకున్నది. సిద్దిపేట రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన పోతుల అరుణ్(23) హైదరాబాద్‌లో హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నాడు. రెండునెలల కింద ఇంటికి వచ్చాడు. అప్పటి నుంచి బాధతో దిగాలుగా ఉంటున్నాడు. ఈ నెల 12న హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి 14న సాయంత్రం వచ్చాడు. ఆరోజు నుంచి సరిగ్గా మాట్లాడడం లేదు. శనివారం ఉదయం తల్లిదండ్రులు వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం వేసి ఉన్నది. వెనకవైపు నుంచి తలుపులు తీసి ఉండగా.. ఇంట్లోకెళ్లి చూడగా.. అరుణ్ దూలానికి ఉరేసుకుని కనిపించాడు. వెంటనే కిందికి దింపి చూసేసరికి నోటి నుంచి పురుగుల మందు వాసన వచ్చింది. అయితే ఫోన్‌లో 'సారీ మమ్మీ.. డాడీ' అని వాయిస్ రికార్డు ఉన్నదని తెలిపారు. తన కుమారుడి మృతికి ముగ్గురిపై అనుమానం ఉన్నదని మృతుడి తండ్రి రవీందర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిద్దిపేట రూరల్ పోలీసులు తెలిపారు.

కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి



సువర్ణ(ఫైల్)

జహీరాబాద్, ఆగస్టు 18: కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ ఆదివారం మృతిచెందింది. ఎస్‌ఐ కాశీనాథ్ వివరాల ప్రకారం.. జహీరాబాద్ పట్టణం అల్లీపూర్‌కు చెందిన బాబు, సువర్ణ(76) కలిసి టీవీఎస్ వాహనంపై అల్లీపూర్‌లో గల చర్చికి వెళ్తున్నారు. ఈ క్రమంలో వెనక వైపు నుంచి వస్తున్న కర్ణాటకకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ద్విచక్ర వాహనం పైనుంచి ఇద్దరు కిందపడ్డారు. ఈ క్రమంలో బస్సు ముందుభాగం టైర్ సువర్ణ తల పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి కుమారుడు భూషణ్‌దీపక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

మెదక్ సీఎస్‌ఐలో భక్తుల సందడి



భక్తులతో కిటకిటలాడిన ప్రత్యేక ప్రార్థనా మందిరం

మెదక్ కల్చరల్, ఆగస్టు 18: మెదక్ సీఎస్‌ఐ చర్చిలో ఆదివారం సందడి నెలకొన్నది. చర్చి ఆవరణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నది. ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయమే శిలువ ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతిష్ఠించిన అనంతరం ప్రార్థనలు నిర్వహించారు. అమెరికాలో దైవజ్ఞాన బ్యాసం చేసిన రెవ.బొల్లం మోసెస్ శాంతికుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం భక్తులకు మత గురువులు ఆశీర్వచనాలందించారు. వరుస సెలవులు ఉండటంతో భక్తులతో ప్రత్యేక ప్రార్థనా మందిరం కిక్కిరిసింది.

ఏడుపాయలకు శ్రావణ శోభ



మూలవిరాట్ వన దుర్గామాత

పాపన్నపేట, ఆగస్టు 18: ఏడుపాయల వన దుర్గామాత ఆలయానికి భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం ఆదివారం కలిసి రావడంతో అమ్మవారి దర్శనానికి ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మంజీరా నదిలో పుణ్య స్నానాలు ఆచరించి, దర్శనం కోసం బారులుతీరి మొక్కులను చెల్లించుకున్నారు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఆలయ, పోలీసులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఐఐటీహెచ్‌లో 'ఫ్యూచర్ ఇన్వెంటర్స్ ఫెయిర్'

- ఆవిష్కరణలతో సత్తాచాటిన బడి పిల్లలు
- అబ్బురపరిచేలా ప్రాజెక్టులు, ఆకట్టుకున్న ప్రదర్శనలు
- ప్రథమ బహుమతి గెలుచుకున్న ఆర్మీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

కంది, ఆగస్టు 18: పాఠశాల దశ నుంచి విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి ఐఐటీ హైదరాబాద్‌లో ఆదివారం ఫ్యూచర్ ఇన్వెంటర్స్ ఫెయిర్ 2వ ఎడిషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బడి పిల్లలలో సాంకేతిక ప్రతిభను వెలికి తీయడానికి ఐఐటీహెచ్ వేదికగా మారింది. ఐఐటీ హైదరాబాద్ గతేడాది నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఈ ఆవిష్కరణల పోటీకి రాష్ట్రంలోని 800 పాఠశాలలకు ఐఐటీహెచ్ ఆహ్వానం పంపించింది. రాష్ట్ర నలుమూలల నుంచి 120కు పైగా పాఠశాలల నుంచి దరఖాస్తులు వచ్చాయి. వీటిల్లో నుంచి సాంకేతిక నైపుణ్యత కలిగిన 18 పాఠశాలలను ఐఐటీహెచ్ అధికారులు ఎంపిక చేశారు. ఇందులో భాగంగా 8, 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు వారి ఆలోచనలకు రూపమిచ్చి భవిష్యత్తు ఆవిష్కరణలను ప్రదర్శించారు. వీటిల్లో పాత్ ఫైండర్ రోబోట్, రిమోట్ కంట్రోల్ సర్వేలెన్సు కార్, చైల్డ్ మానిటరింగ్ సిస్టం, డైనమిక్ టెంపరేచర్ మానిటరింగ్, మ్యాగ్నటిక్ విండో క్లీనర్, ఫైర్ ఫైటింగ్ డ్రోన్, యాంటీ స్లీప్ డిటెక్టర్, ఫ్లోర్ క్లీనింగ్ రోబోట్, గివింగ్ బ్యాక్ టు నేచర్, ఎంపవరింగ్ స్టిక్, ఫార్మింగ్ బాట్, ఈ సైకిల్ తదితర ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఇందులో హైదరాబాద్ మచ్చ బొల్లారం ఆర్మీ పబ్లిక్ స్కూల్ విద్యార్థినులు తయారుచేసిన యాంటీ స్లీప్ డిటెక్టర్ కళ్లజోడు ప్రాజెక్టుకు రూ.20 వేల ప్రథమ బహుమతి దక్కింది. డైనమిక్ టెంపరేచర్ మానిటరింగ్ సిస్టంను రూపొందించిన రామంతపూర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు రూ.10 వేల ద్వితీయ బహుమతి వచ్చింది. కొబ్బరిబోండాల వ్యర్థాలను పంటలకు ఉపయోగించే విధంగా ప్రాజెక్టు రూపొందించిన కీసరలోని సెయింట్ ఆండ్రూస్ పాఠశాలకు రూ.5 వేల మూడో బహుమతి లభించింది. ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి ఆయా పాఠశాలల విద్యార్థులకు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేసి మాట్లాడారు. బడి ఈడు వయసున్న పిల్లల ఊహలకు ఆవిష్కరణ రూపం ఇచ్చేందుకే ఫ్యూచర్ ఇన్వెంటర్ ఫెయిర్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి అబ్దుల్ కలాం అంత గొప్పగా ఆలోచించి మంచి ఆవిష్కర్తలు కావాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.



జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రూపొందించిన బయో ఆర్మ్



ఆవిష్కరణలను పరిశీలిస్తున్న ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

ఫైర్ ఫైటింగ్ డ్రోన్

ఎత్తైన భవనాల్లో మంటలు చెలరేగినప్పుడు టార్గెట్‌కు దగ్గరగా నీటి పైపులను తీసుకెళ్లి మంటలను ఆర్పే ఫైర్ ఫైటింగ్ డ్రోన్‌ను కొల్లూరులోని బిర్లా ఓపెన్ మైండ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థి అనీష్‌వర్మ రూపొందించాడు. అంతేకాక ఈ డ్రోన్‌లో ఉంచిన ప్రత్యేక చిప్ ద్వారా మంటలను గుర్తించి ప్రత్యేకమైన శబ్దాన్ని చేస్తున్నది. ఏదైనా ఎత్తైన బిల్డింగ్‌లో అకస్మాత్తుగా అగ్ని ప్రమాదం జరిగితే ఈ డ్రోన్ కిందనున్న నీటి ట్యాంకర్ నుంచి కానీ, ఫైర్ సేఫ్టీ ట్యాంక్ నుంచి గానీ నీటి పైపులను తీసుకెళ్లి నేరుగా మంటలను చల్లార్పుతుంది. భవిష్యత్తులో దీన్ని మరింతగా అభివృద్ధి చేసి చూపిస్తానని విద్యార్థి అనీష్‌వర్మ పేర్కొన్నాడు

చేతులు కోల్పోయిన వారికి బయో ఆర్మ్

ప్రమాదంలో చేతులు కోల్పోయిన వారికి త్రీడీ ప్రింట్ టెక్నాలజీతో జూబ్లీహిల్స్ పబ్లిక్ విద్యార్థులు మనీష్, సుహాస్, నితీష్‌లు బయో ఆర్మ్ పరికరాన్ని అభివృద్ధి చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఉపయోగించి తయారుచేసిన ఈ పరికరం అచ్చం మనచేతి లాగే ఉంటుంది. ఈ బయో ఆర్మ్ పరికరానికి అనుసంధానంగా కోల్పోయిన చేయి పై భాగంలో సెన్సార్‌తో కూడిన ప్రత్యేక పరికరాన్ని అమర్చడం వల్ల చేతిలోని కదలికలు సాధారణ చేతుల మాదిరిగానే ఉంటాయని ఈ భవిష్యత్తు ఆవిష్కర్తలు చెబుతున్నారు.


రైతులకు ఉపయోగపడేలా... మల్టీపర్పస్ ఫార్మింగ్ బాట్ యంత్రం

ఒకే యంత్రం విత్తనాలు చల్లుతూ, మొక్కలకు పురుగుల మందులు పిచికారీ చేస్తూ, కలుపుతీస్తూ వివిధ రకాలుగా ఉపయోగపడే మల్టీపర్పస్ ఫార్మింగ్ బాట్ యంత్రాన్ని ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో పదవ తరగతి చదివే విద్యార్థులు శివ, అమన్, మోల్విన్ తయారు చేశారు. దీంతో రైతు తన వద్దనున్న మొబైల్ ఫోన్‌లో దీనికి సంబంధించిన యాప్‌ను అనుసంధానం చేసుకొని రంగుల ద్వారా, అంకెల ద్వారా చాలా సులువుగా పంటపొలాల్లో పనిచేయించుకోవచ్చని, భవిష్యత్తులో ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని విద్యార్థులు వివరించారు.

కొబ్బరిపీచుతో ప్రకృతిని తిరిగి కాపాడుకోవచ్చు

మనం తాగిపడేసిన కొబ్బరిబోండాలతో కూడా అనేకరకాల ఉపయోగాలున్నాయని కీసరలోని సెయింట్ ఆండ్రూస్ పాఠశాలలో 9వ తరగతి చదివే విద్యార్థులు నిరూపించారు. గివింగ్ బ్యాక్ టూ నేచర్ పేరుతో ఓ ప్రాజెక్టును రూపొందించారు. వాడేసిన కొబ్బరి బోండాలను ఎండబెట్టి ఓ క్రషర్‌లో వేసి కోకోపిట్ (కొబ్బరిపొట్టు) తయారు చేశారు. ఈ కోకోపిట్‌తో మొక్కలను పెంచుకోవడానికి, పంటల్లో ఎరువులుగా వినియోగించుకోవడానికి, ఇంటి స్లాబులు వేసేటప్పుడు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు చెబుతున్నారు.

ఫుట్‌బాల్ టోర్నీ విజేత మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల



తెలంగాణ మైనార్టీ పాఠశాల క్రీడాకారులకు కప్ అందజేస్తున్న సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు తమంగ్

సిద్దిపేట టౌన్, ఆగస్టు 18: పాఠశాల స్థాయిలో సిద్దిపేట పట్టణంలోని మినీ స్టేడియంలో నిర్వహించిన ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల విజేతగా నిలిచినట్లు ఫుట్‌బాల్ కోచ్ అక్బర్ నవాబ్ తెలిపారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని మినీ స్టేడియం ఫుట్‌బాల్ మైదానంలో అంబిటాస్, తెలంగాణ మైనారిటీ పాఠశాలల మధ్య ఫైనల్ జరగ్గా.. 3-2గోల్స్‌తో అంబిటస్ పాఠశాలపై మైనారిటీ పాఠశాల విజయం సాధించి కప్ గెలుచుకుంది. ఈ సందర్భంగా అక్బర్ నవాబ్ మాట్లాడుతూ 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంట్‌లో దాదాపు 10 పాఠశాలలకు చెందిన టీంలు పోటీలో పాల్గొన్నాయని తెలిపారు. విజేతగా నిలిచిన మైనారిటీ పాఠశాలకు సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు తమంగ్ కప్‌ను అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన జట్టుకు జర్నలిస్ట్ సాజిద్ కప్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్నా.. మా రోడ్లకు మరమ్మతులు చేయండి..

- కొన్ని రోడ్లు విస్తరణ చేయాలి.. నిధులు కేటాయించండి
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తన నియోజకవర్గంలోని రోడ్లను విస్తరించడంతో పాటు, మరమ్మత్తులకు నిధులను కేటాయించాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం.మహిపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం హైదరాబాద్, బంజారాహిల్స్ లోని మంత్రి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్ల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పటాన్‌చెరు, సంగారెడ్డి నియోజకవర్గాల్లో భారీ పరిశ్రమలు ఉండడంతో పాటు పలు రహదారులు ఔటర్ రింగ్ రోడ్డుకు వెళ్తున్నా యని, దీంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటోందన్నారు. రోడ్లు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, దీని కారణంగా వివిధ కాలనీల ప్రజలు, ఆ ప్రాంతంలో ఉన్న ఇంజనీరింగ్ కాలేజీల్లో చదివే విద్యార్థులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారని వివరించారు. స్పందించిన మంత్రి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మహిపాల్ ప్రతిపాదించిన రహదారుల మరమ్మత్తులు, విస్తరణ పనులకు వెంటనే అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా తమ ప్రభుత్వం రోడ్ల మరమ్మత్తులు, విస్తరణ విషయంలో ప్రత్యేక ప్రణాళికతో ముందుకువెళ్తుందని ఎమ్మెల్యేకు చెప్పారని మంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.



మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

ఇవీ ప్రతిపాదనలు...

- పటాన్‌చెరు నుంచి శంకర్‌పల్లి వరకు ఉన్న డబుల్‌లైన్ రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించడం. ఇందుకు రూ.70 కోట్లు కేటాయించాలి.
- కిష్టారెడ్డిపేట నుంచి దౌల్తాబాద్ వయా రామేశ్వరబండ వరకు ఉన్న సింగిల్ లేన్ రోడ్డును రెండు లేన్లుగా విస్తరించాలి, ఇందుకోసం రూ.5కోట్లు.
- పటాన్‌చెరు నుంచి మల్కాపూర్ రోడ్డు మరమ్మత్తులకు రూ.5.25కోట్లు.
- బీహెచ్‌ఈఎల్ మెయిన్‌గేటు నుంచి ఎన్.హెచ్-9 వయా వెల్మలా రోడ్డు మరమ్మత్తులకు రూ.2.1కోట్లు
- గుమ్మడిదల నుంచి నూతనకల్ వయా కనుకుంట రోడ్డు విస్తరణకు రూ.6.82కోట్లు
- శివనగర్ నుంచి కంజెర్ల రోడ్డు విస్తరణకు రూ.2కోట్లు మంజూరు చేయాలని మంత్రికి ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.


జహీరాబాద్‌లో సర్దార్‌సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాల్లో గౌడసంఘం నాయకులు


వట్‌పల్లి చౌరస్తాలోని పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గౌడసంఘం నాయకులు


నారాయణఖేడ్: పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడసంఘం, కాంగ్రెస్ నాయకులు


తూప్రాన్‌లో సర్వాయి పాపన్నగౌడ్ ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న గౌడసంఘం నాయకులు


నర్సాపూర్‌లో సర్వాయి పాపన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి


నర్సాపూర్‌లో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు


వెల్దుర్తిలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గౌడ కులస్థులు


చిలప్‌చెడ్‌లో సర్దార్‌పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడసంఘం నాయకులు

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్.. గొప్ప ఉద్యమకారుడు

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని కలెక్టరేట్‌లతో పాటు గౌడ సంఘాల ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ చిత్రపటాలు, విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు మాట్లాడుతూ సర్వాయి పాపన్నగౌడ్ సేవలు మరువలేనివని పేర్కొన్నారు. మొగలుల దౌర్జన్యాలను, దొరల అరాచకాలను ఎదిరించిన బహుజనయోధుడని కొనియాడారు.

మెదక్ అర్బన్, ఆగస్టు 18: తెలంగాణలో సర్వాయి పాపన్నగౌడ్ గొప్ప ఉద్యమకారుడని, ఆయనను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. మెదక్ కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో ఆదివారం జిల్లా బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి వేడుకలను కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. సర్వాయి పాపన్నగౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షించారు. అంతకుముందు గౌడ సంఘం నాయకులతో కలిసి పట్టణంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూల మాలలతో నివాళులర్పిచారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి నాగరాజ్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, పట్టణ గౌడ సంఘం అధ్యక్షులు గడ్డమీది కృష్ణాగౌడ్, కౌన్సిలర్లు ఆర్కేశ్రీను, లక్ష్మీనారాయణగౌడ్, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● నర్సాపూర్, ఆగస్టు 18: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374 జయంతి సందర్భంగా నర్సాపూర్‌లో ఆదివారం ఆయా పార్టీల నాయకులతో పాటు గౌడ సంఘం ప్రతినిధులు ఘనంగా నివాళర్పించారు. నర్సాపూర్‌లోని సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ నయీం, కాంగ్రెస్, బీజేపీ నాయకులు తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.


నిజాంపేట: సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గౌడ కులస్థులు

● తూప్రాన్: తూప్రాన్ గౌడసంఘం ఆధ్వర్యంలో పట్టణంలో సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీశైలంగౌడ్, గౌడ సంఘం నాయకులు నాగరాజుగౌడ్, నందంగౌడ్, మల్లికార్జున్‌గౌడ్ పాల్గొన్నారు.

● వెల్దుర్తి, ఆగస్టు 18: మండల కేంద్రంలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో స్థానిక గౌడసంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సుధాకర్‌గౌడ్, నరేందర్‌గౌడ్, కిష్టగౌడ్, దుర్గాగౌడ్, అశోక్ గౌడ్, శంకరయ్యగౌడ్, శివగౌడ్, తదితరులు ఉన్నారు.

● చిలప్‌చెడ్: మండల కేంద్రంలో ఆదివారం మండల గౌడ సంఘం సభ్యులు పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు శ్రీకాంత్‌గౌడ్, శివయ్యగౌడ్, అంతాగౌడ్, కిష్టాగౌడ్, సుమన్‌గౌడ్, లింగాగౌడ్, కిష్టాగౌడ్, ప్రవీణ్‌గౌడ్, మధుసూదన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● చిన్నశంకరంపేట: మండల కేంద్రంతో పాటు మడూర్, తదితర గ్రామాల్లోని గౌడసంఘం ఆధ్వర్యంలో పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చిన్న రమేష్‌గౌడ్, లక్ష్మాగౌడ్, అంజనేయులుగౌడ్, సత్యగౌడ్, సురేష్‌గౌడ్, పోచాగౌడ్, వినయ్‌గౌడ్, గీతేందర్‌గౌడ్, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


పాపన్నపేట:సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

● రేగోడు: మండలకేంద్రంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో గాంధీచౌక్ వద్ద సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటాన్ని ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడసంఘం నాయకులు రామాగౌడ్, సుభాష్‌గౌడ్, సతీష్ గౌడ్, అంజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● టేక్మాల్: మండలంలోని బొడ్మాట్‌పల్లి గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజుగౌడ్, అంజయ్య, నర్సింలు తదితరులు ఉన్నారు.

● అల్లాదుర్గం: మండలంలోని చిల్వర్ గ్రామంలో గౌడసంఘం ఆధ్వర్యంలో పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నర్సింహగౌడ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, దుర్గాగౌడ్, విఠల్‌గౌడ్, రవిగౌడ్, దత్తుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● నిజాంపేట: మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

● పాపన్నపేట: బహుజన యోధుడు, మొగులాయి దౌర్జన్యాలను ఎదిరించిన ధీరుడు సర్వాయి పాపన్న గౌడ్ సేవలు మరువలేనివి, ఆయన ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని మండల గౌడ సంఘం అధ్యక్షుడు బాబా గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గౌడ కులస్తులు ఎల్లాపూర్ నుంచి మల్లంపేట వరకు బైక్ ర్యాలీ నిర్వహించి. సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏడుపాయల మాజీ చైర్మన్ బాలాగౌడ్, నరేందర్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, యూసుఫ్‌పేట సాయి, మచ్చేందర్, నవీన్‌గౌడ్, కిష్టాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


మెదక్‌లో సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

సంగారెడ్డి జిల్లాలో..

జహీరాబాద్, ఆగస్టు 18: సర్దార్‌సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను ఆదివారం జహీరాబాద్ గౌడ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అల్గోల్ చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగ పలువురు గౌడసంఘం నాయకులు మాట్లాడుతూ ఆయన ఆశయసాధనకు కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో గౌడసంఘం నాయకులు, కాంగ్రెస్‌నాయకులు విఠల్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ప్రభాకర్‌గౌడ్, మురళీక్రిష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● వట్‌పల్లి : వట్‌పల్లి చౌరస్తా వద్ద గల సర్వాయి పాపన్న విగ్రహానికి స్థానిక గౌడసంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అశోక్‌గౌడ్, నర్సింహగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, గోపాల్‌గౌడ్, ఎల్లాగౌడ్, ప్రవీణ్‌గౌడ్, సువాన్‌గౌడ్, మహేందర్‌గౌడ్, సాయాగౌడ్, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

● నారాయణఖేడ్: నారాయణఖేడ్‌లోని కల్లుగీత కార్మికసంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ దారం శంకర్, యువజన కాంగ్రెస్‌నాయకులు సాగర్‌షెట్కార్, దిలీప్ గౌడ్, సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజాగౌడ్, జిల్లా, స్థానిక బాధ్యులు సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


చిన్నశంకరంపేట: మడూర్‌లో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు


రేగోడు:సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో గౌడ సంఘం నాయకులు


టేక్మాల్: బొడ్మాట్‌పల్లిలో సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గౌడకులస్థులు


అల్లాదుర్గం: చిల్వర్‌లో పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడసంఘం నాయకులు

బొల్లారంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

జిన్నారం, ఆగస్టు 18: బొల్లారం మున్సిపాలిటీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఆదివారం స్థానిక కేబీఆర్ కాలనీ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడిఉన్నట్లు స్థానికుల నుంచి పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ జరిపారు. సుమారు 45 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతదేహాన్ని గుర్తించామని, కేసు నమోదు చేసినట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

వ్యవసాయ బావుల వద్ద బోరుమోటార్లు చోరీ

రామాయంపేట, ఆగస్టు 18: అక్కన్నపేటలోని ఓ వ్యవసాయ పొలం వద్ద శనివారం అర్ధరాత్రి రెండు బోరు మోటార్లను దొంగలు ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన గోవర్ధన్, జయరాం అనే ఇద్దరు రైతులకు చెందిన వ్యవసాయ బావుల వద్ద పైపులను పైకి తీసి మోటార్లు ఎత్తుకెళ్లినట్టు బాధితులు వాపోయారు. ఆదివారం ఉదయం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

51 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చేగుంట, ఆగస్టు 18: తిరుమల రైస్ మిల్లుకు అక్రమంగా తరలిస్తున్న 60 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి, పలువురిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన మండలంలోని ఇబ్రాహీంపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. లారీలో అక్రమంగా పీడీఎఫ్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు రెవెన్యూ అధికారులకు విశ్వసనీయంగా సమాచారమందింది. ఈ మేరకు పోలీసులు, రెవెన్యూ అధికారులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా 120బ్యాగుల్లో 60 క్వింటాళ్ల పీడీఎఫ్ బియ్యాన్ని గుర్తించి, అక్రమంగా తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నారు. తిరుమల రైస్ మిల్లును సీజ్ చేసినట్లు ఆర్ఐ నర్సింగ్ యాదవ్ తెలిపారు.


పట్టుబడిన పీడీఎఫ్ బియ్యం

పాలరైతుల పెండింగ్ బిల్లులు ఇప్పించేందుకు కృషి

● జహీరాబాద్ పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ డేవిడ్ రాజు



జహీరాబాద్, ఆగస్టు 18: పట్టణంలోని పాలశీతలీకరణ కేంద్రానికి పాలను తీసుకువస్తున్న రైతులు ఆందోళన చెందవద్దని, అందరికీ త్వరలోనే బిల్లులు చెల్లించేలా కృషిచేస్తున్నామని జహీరాబాద్ పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ డేవిడ్‌రాజు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజూ జహీరాబాద్ మిల్క్ చిల్లింగ్ సెంటర్‌కు 60 పాలసేకరణ సెంటర్‌ల ద్వారా 6000 పైచిలుకు లీటర్ల పాలు వస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో విజయడైరీ పాలసేకరణ అంచనాలకు మించి ఉండడంతో బిల్లుల చెల్లింపుల్లో ఆలస్యమవుతుందన్నారు. 300 మంది రైతులకు సంబంధించి సుమారు రూ.75లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటన్నింటిని చెల్లించేలా విజయడైరీ యాజమాన్యం చర్యలు చేపడుతుందన్నారు. గతేడాది కన్నా జహీరాబాద్ మిల్క్‌చిల్లింగ్ సెంటర్‌లో సుమారు 500లీటర్ల పాలసేకరణ ఎక్కువగా చేపడుతున్నామన్నారు.

చౌదరిపల్లిలో గోమాతకు అంత్యక్రియలు

రేగోడు ఆగస్టు 18: మండలంలోని చౌదరిపల్లిలో శ్రీ హనుమాన్ ఆలయానికి చెందిన ఆవు మృతి చెందడంతో శనివారం రాత్రి గ్రామస్థులు సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. నాలుగేళ్లుగా ఆలయానికి చెందిన ఈ ఆవు గ్రామంలో ప్రతీ ఇంటికి వెళ్లి దానా స్వీకరించేదని తెలిపారు.


మృతి చెందిన ఆవు

శివానగర్ రోడ్డు మరమ్మతులకు నిధులు కేటాయించాలి


ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, నాయకులు

జిన్నారం, ఆగస్టు 18: జిన్నారం మండలం శివానగర్ నుంచి కంజర్ల వరకు ప్రధాన రహదారి మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, స్థానిక నాయకులు వినతి పత్రం అందజేశారు. ఆదివారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు ప్రభాకర్, శివానగర్ నాయకులు కృష్ణ, మహేష్ ఇతర నాయకులు కలిశారు. శివానగర్ నుంచి కంజర్ల వరకు రహదారి విస్తరణకు చేపట్టిన పనులు నిలిచిపోగా గుంతల మయంగా మారిందని 10 గ్రామాల ప్రజలకు నిత్యం తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలోనే నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, ఫహీం, నర్సింహులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

నారాయణఖేడ్, ఆగస్టు 18: మనూరు మండలం మాయికోడ్ గ్రామానికి చెందిన సౌజన్యకు సీఎం సహాయనిధి ద్వారా రూ.29,500 ఆర్థిక సహాయం మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్కును ఆదివారం ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఖేడ్‌లో బాధితురాలి కుటుంబీకులకు అందజేశారు. కార్యక్రమంలో ఖేడ్ పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు నగేష్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు లాయక్, నాయకులు నాగేందర్,సుధాకర్, రాజు తదితరులు ఉన్నారు.

● మునిపల్లి, ఆగస్టు 18: మండల కేంద్రానికి చెందిన పోతురాజు అరుణకు సీఎంఆర్ఎఫ్ కింద రూ.60వేల ఆర్థికసాయం మంజూరైంది. సదరు చెక్కును ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు నరేందర్‌గౌడ్ అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రాజు పాటిల్, నాయకులు పరమేశ్వర్ రావు, మహేందర్, పాండు, వంశీ, రాకేష్, రాహుల్ పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికకు పోలింగ్

నారాయణఖేడ్, ఆగస్టు 18: పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు గాను ఆదివారం ఖేడ్‌లోని మార్కండేయ భవన్‌లో పోలింగ్ నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గటల వరకు జరిగింది. ఖేడ్ నియోజకవర్గంలోని పద్మశాలీ సంఘం ఓటరు సభ్యులు బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్ర అధ్యక్ష పదవికి పలువురు తీవ్రంగా పోటీపడుతున్నట్టు సంఘం బాధ్యులు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్

హత్నూర, ఆగస్టు 18: మండల పరిధిలోని తుర్కలఖానాపూర్ మాజీ సర్పంచ్ చంద్రాగౌడ్ బీఆర్ఎస్ పార్టీని వీడి ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, రాజిరెడ్డిల సమక్షంలో తన అనుచర గణంతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కర్రె కృష్ణ, కొన్యాల వెంకటేశం, యాదాగౌడ్, సందీప్, శ్రీకాంత్ గౌడ్, మహేష్ గౌడ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ సేవలు చిరస్మరణీయం: బీజేపీ

పెద్దశంకరంపేట, ఆగస్టు 18: దేశానికి నేతాజీ సుభాష్ చంద్రబోస్ చేసిన సేవలు చిరస్మరణీయమని పెద్దశంకరంపేట మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్ పేర్కొన్నారు. ఆదివారం పెద్దశంకరంపేటలోని బీజేపీ కార్యాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు తదితరులుపాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్డు.. బస్సు సౌకర్యం బంద్

నర్సాపూర్, ఆగస్టు 18: నర్సాపూర్ నుంచి పటాన్‌చెరుకు రోజూ నడిపే బస్సులను రోడ్డు బాగాలేకపోవడంతో నడపలేకపోతున్నట్లు డిపో అధికారులు పేర్కొంటున్నారు. నర్సాపూర్ నుంచి రోజూ వేలాది మంది ఉద్యోగులు, విద్యార్థులతో పాటు పటాన్‌చెరు ప్రాంతంలో ఉన్న పరిశ్రమలలో పనిచేసే వారు వందలాదిగా ప్రయాణిస్తుంటారు. అదేవిధంగా పటాన్‌చెరు, బీహెచ్ఈఎల్ తదితర ప్రాంతాల్లో ఉండే ప్రభుత్వ ఉద్యోగులు ఇక్కడ పనిచేయడానికి వస్తుంటారు. నర్సాపూర్ డిపో ఏర్పాటైనప్పటి నుంచి పటాన్‌చెరుకు వయా నత్నయపల్లి, కాగజ్‌మద్దూర్ మీదుగా గంటకో బస్సు నడిపే వారు. అయితే నర్సాపూర్ మండలం కొండాపూర్ నుంచి శేర్‌కాన్‌పల్లి వరకు రోడ్డుపై పెద్దపెద్ద గుంతలతో దారుణంగా ఉండటంతో బస్సులు తరుచూ మరమ్మతులకు గురవుతున్నాయని, అంతేకాకుండా ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తతో ఈ నెల 15వ తేదీ నుంచి బస్సులను నిలిపివేసినట్లు అధికారులు చెబుతున్నారు. రోడ్డు మరమ్మతు తర్వాతే మళ్లీ నడుపుతామంటున్నారు. అధ్వానంగా మారిన నత్నయపల్లి రోడ్డును వెంటనే బాగు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

21న నిరాహార దీక్షను జయప్రదం చేయండి

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 18: మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారం కోసం ఈ నెల 21న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించే నిరాహార దీక్షలో ఉపాధ్యాయులు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, ఎంఎస్‌టీఎఫ్ రారష్ట్ర అధ్యక్షుడు కొండయ్యలు పిలుపునిచ్చారు. సంగారెడ్డిలో ఆదివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. మోడల్ స్కూళ్ల స్థాపించి 11 ఏళ్లు పూర్తవుతున్నా ఇప్పటి వరకు బదిలీలు నిర్వహించకపోవడం సరికాదన్నారు. సమావేశంలో యూటీఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, సాయిలు, జిల్లా కోశాధికారి శ్రీనివాస్ రావు, ఎంఎస్ఎఫ్ ఫెడరేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయానికి భూమి పూజ

పెద్దశంకరంపేట, ఆగస్టు 18: పట్టణంలోని ప్రియాంక కాలనీలో కొత్తగా నిర్మిస్తున్న ముత్యాల పోచమ్మ ఆలయ నిర్మాణానికి ఆదివారం కాలనీవాసులు, గ్రామపెద్ద సమక్షంలో పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు నగేష్ షెట్కార్, టీపీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్, సాగర్‌షెట్కార్, కాలనీకమిటీ అధ్యక్షుడు ఫణికుమార్, కాలనీ కమిటీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

మాసాయిపేటలో ఘనంగా ఉజ్జయిని మహంకాళి జాతర


జాతరలో పాల్గొన్న భక్త బృందం, కాంగ్రెస్ నాయకులు

మాసాయిపేట, ఆగస్టు 18: మండల కేంద్రంలో జాతీయ రహదారికి సమీపంలో గల పురాతన ఉజ్జయిని మహంకాళీ అమ్మవారి జాతర ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. మూడు రోజులపాటు నిర్వహించే ఈ జాతర మహోత్సవాలకు చుట్టుపక్కల సుమారు 50 గ్రామాల నుంచి ప్రజలు విచ్చేసి అమ్మవారికి బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. ఈసారి అమ్మవారి ఆలయానికి ప్రత్యేక అలంకరణలు, కళాకారుల ఆటపాటలు, డప్పుచప్పుళ్లు, బాజా భజంత్రీలతో భారీ జన సమీకరణతో ఆలయాల వద్ద సందడి నెలకొంది. ఉదయం నుండే అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, హోమగుండం పూజలు నిర్వహించారు. ప్రతీ వాడ నుంచి అమ్మవారికి బోనాలు ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. వివిధ ఆలయాల వద్ద మాజీ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులతో పాటు పలు పార్టీల నాయకులు ప్రత్యేకపూజలు చేశారు. వివిధ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున బోనాల జాతరలో పాల్గొన్నారు.


కాజీపల్లిలో బోనాల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు, భక్తులు

కాజీపల్లిలో ఘనంగా బోనాల పండుగ

జిన్నారం, ఆగస్టు 18: మండలంలోని కాజీపల్లిలో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం కాజీపల్లిలో శ్రావణ మాస బోనాల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రధాన కూడలి నుంచి పోచమ్మ ఆలయం వరకు భక్తులు, మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించి పూజలు జరిపారు.

బదిలీపై వెళ్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఘన సన్మానం

మెదక్ కల్చరల్, ఆగస్టు 18: మెదక్ జిల్లా ఆసుపత్రుల సమన్వయ కర్తగా దాదాపు 26 ఏళ్ల సుదీర్ఘ కాలం పని చేసిన పిప్పిరి చంద్రశేఖర్ ఇటీవలే రంగారెడ్డి జిల్లా కొండాపూర్ డీసీహెచ్ఎస్‌గా బదిలీ పై వెళ్లడంతో ఆయనకు ఆదివారం మాతాశిశు సంరక్షణ, జిల్లా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరం ఇటీవలే జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త గా బాధ్యతలు స్వీకరించిన సీనియర్ వైద్యులు శివదాయల్ మాట్లాడుతూ బదిలీలు సహజమని, మనం అందించిన సేవలు కలకాలం ప్రజలకు గుర్తుంటాయన్నారు. అనంతరం సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సమన్వయకర్త కిరణ్‌రెడ్డి, సీనియర్ వైద్యుడు చంద్రశేఖర్, పిల్లల వైద్య నిపుణులు తిరుమలేష్, ఆర్ఎంవో షర్మిల, తుప్రాన్ సూపరిండెంట్ అమీర్ సింగ్, నర్సాపూర్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మీర్జా, జయప్రసాద్, లింబాద్రి,ఎయిడ్స్ కంట్రోల్ కౌన్సెలర్ రాజేష్, ఫార్మాసిస్ట్ బాలప్రసాద్, అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.


చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న జిల్లా ఆసుపత్రుల సమన్వయ కర్త డాక్టర్ శివదయాల్, వైద్యులు

బొంతపల్లి ఆలయంలో శ్రావణ సందడి

గుమ్మడిదల, ఆగస్టు 18: మండలంలోని బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా భక్తుల సందడి నెలకొన్నది. ఆదివారం వీరభద్రస్వామి ఆలయానికి హైదరాబాద్ నగరంతో పాటు, సమీప ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. పలు జిల్లాలకు చెందిన న్యాయాధికారులు స్వామివారిని దర్శించుకోగా ఆలయ ఈవో శశిధర్‌గుప్తా సిబ్బందితో కలిసి వారిని సన్మానించారు. ఆలయం వద్ద భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు.

రుణమాఫీపై సంబురాలు

మునిపల్లి, ఆగస్టు 18: రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ చేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం మండల పరిధిలోని మేళసంగం గ్రామంలో రైతులు, కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా టపాసులు పేల్చి, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదరరాజనర్సింహ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

మూఢవిశ్వాసాల నివారణపై అవగాహన

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 18: మూఢవిశ్వాసాల నివారణకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. సంగారెడ్డిలోని జనవిజ్ఞానవేదిక కార్యాలయంలో ఆదివారం మహాసభ నిర్వహించారు. మహాసభలో జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్ రావు, రాష్ట్ర కోశాధికారి బీఎస్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రతాప్ అధ్వర్యంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బాలయ్య, ప్రధాన కార్యదర్శిగా సాయితేజ, కోశాధికారిగా ప్రశాంత్‌కుమార్, గౌరవ అధ్యక్షులుగా జాన్‌పాల్, సోమశేఖర్, ఉపాధ్యక్షులుగా శశిధర్, మొగులయ్య, గౌసుద్దీన్, మహేష్‌చారి, సంయుక్త కార్యదర్శులుగా జగన్‌మోహన్, చంద్రారెడ్డి, ఎండీ దియాకత్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా రఘునందన్, రమేష్, తిరుమల్‌రావు, హెల్త్ కమిటీ కన్వీనర్‌గా డా.వెంకటేశ్, ఎన్విరాన్‌మెంట్ సబ్ కమిటీ కన్వీనర్‌గా చంద్రమోహన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

తండాను పంచాయతీగా ఏర్పాటు చేయాలి


సింగమర్రి తండా దారిలో ధర్నా చేస్తున్న గిరిజనులు

కౌడిపల్లి, ఆగస్టు 18: నూతనంగా ఏర్పాటు చేయనున్న గ్రామపంచాయతీలతో పాటు సమీపంలోని 3 తండాలను కలుపుతూ నూతన పంచాయతీగా ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ఆయా తండాల గిరిజనులు ధర్నా చేపట్టారు. మండల పరిధిలోని కిష్టరగడి తండా, తాళ్లగడ్డ తండాను కలుపుతూ సింగమర్రి తండాను పంచాయతీగా చేయాలని తండావాసులు ఆదివారం సింగమర్రి తండాకు వచ్చే దారిలో ధర్నా చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు తండాల్లో కలిపి జనాభా 429 మంది ఉన్నామని తెలిపారు. మండలంలో అనేక గిరిజన తండాలను నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేసినప్పటికీ తమ తండాలను మాత్రం నిర్లక్ష్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయని పక్షంలో అధికారులను, గ్రామస్థులను తండాకు రానివ్వబోమని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో సిద్దు నాయక్, శ్రీకాంత్, రమేష్, మారుతి, సురేష్, రాజు, శంకర్, తండావాసులు ఉన్నారు.